నేడు కనకదుర్గాదేవి ఆలయంలో వార్షికోత్సవం

బాలానగర్, ఆగస్టు 18 : ఫతేనగర్ జవహర్‌నగర్ కాలనీలోని కనకదుర్గాదేవి, శీతలాదేవి, కాళికాదేవి ఆలయంలో 28వ ప్రతిష్ఠాపన వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి దోర్భల కాశీనాథ్ శర్మ పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పోరాట యోధుడు.. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్

- పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు

బాలానగర్, ఆగస్టు 18 : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్.. పోరాట యోధుడు, ఆదర్శప్రాయుడని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి సందర్భంగా కూకట్‌పల్లిలో పాపన్నగౌడ్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ప్రతీక అన్నారు. ఆయన ఆశయాల సాధనకు నేటి యువత కృషి చేయాలన్నారు. ఆనాటి అసమానతలను రూపమాపడానికి, రాజరిక పోకడలకు వ్యతిరేకంగా సబ్బండవర్గాల సమన్వయంతో పోరాడారని కొనియాడారు. బహుజన రాజ్యాధికారం కోసం పోరాడిన వీరుడు సర్వాయి పాపన్నగౌడ్ అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో శ్రమించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, స్థానిక నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



మియాపూర్: ఆల్విన్‌కాలనీ చౌరస్తాలో పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్, తదితరులు

మూసాపేటలో..

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు ఆదివారం మూసాపేటలో ఘనంగా జరిగాయి. మూసాపేట జనతానగర్‌లో పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శివానంద రిహాబిలిటేషన్ సెంటర్‌లో రోగులకు శాలువాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్ చౌదరి, కే. నాగరాజు, వెంకట్‌రావు, శెభాశ్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, పృథ్వీరాజ్, భాస్కర్ రావు, సుశీల్ కుమార్, శారద తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి ఎం.కాంతారావు అన్నారు. ఆదివారం కూకట్‌పల్లిలో నిర్వహించిన సర్దార్ పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో పాల్గొని పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంతారావు మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో జన్మించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ నాటి పాలకుల తీరును వ్యతిరేకించి పోరాటాలు చేశారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుండిగల్: సర్ధార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాళ వేసి నివాళులర్పిస్తున్న కూన శ్రీశైలంగౌడ్ తదితరులు



బాలానగర్: కూకట్‌పల్లిలో పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు పాపన్నగౌడ్ : ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పేదలను ఏకంచేసి పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం మియాపూర్ డివిజన్ ఆల్విన్ కాలనీ చౌరస్తాలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వివక్ష లేని రాజ్యాధికారం కోసం పాపన్న గౌడ్ పోరాడారని అన్నారు.

కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు లక్ష్మీనారాయణగౌడ్, జగదీశ్వర్ గౌడ్, వెంకటేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వినయ్ కుమార్ గౌడ్, మోహన్‌గౌడ్, అశోక్‌గౌడ్, ఓంప్రకాశ్, నాగేశ్వర్, వెంకటేశ్, అనీల్‌కుమార్, మురళీ, శ్రీనివాస్‌యాదవ్, ఏకాంత్, రవీందర్, నందు తదితరులు పాల్గొన్నారు.

- ఆల్విన్ చౌరస్తాలో పాపన్న గౌడ్ విగ్రహానికి కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్, అశోక్‌గౌడ్‌లతో కలిసి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.
- ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్ తన కార్యాలయంలో పాపన్న గౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తెలంగాణ వీరత్వానికి పరాక్రమానికి పాప న్నగౌడ్ ప్రతీక అన్నారు. సబ్బండ వర్గాల ఆత్మ గౌరవానికి ఆయన స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాలానగర్ : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు



మియాపూర్ : సర్వాయి పాపన్నగౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్, తదితరులు

గాజులరామారం చౌరస్తాలో...

దుండిగల్ : బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. గాజులరామారం చౌరస్తాలో పాపన్న గౌడ్ చిత్రపటానికి కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో నాయకులు కూన శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు వినతులు

దుండిగల్, ఆగష్టు 18 : ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజును ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మైరాన్ హోమ్స్ టీవీసీ ప్రారంభం

కొండాపూర్, ఆగస్టు 18 : ప్రతి ఒక్కరి సొంతింటి కలను నిజం చేసేలా మైరాన్ హోమ్స్ ముందుకు సాగుతుందని సినీ నటుడు మురళీమోహన్ అన్నారు. ఆదివారం మాదాపూర్‌లోని ఆవాస హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన సినీ నిర్మాతలు అశ్వనీదత్, కేఎస్ రామారావుతో కలిసి మైరాన్ హోమ్స్ టీవీసీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆహ్లాదకరమైన ప్రకృతిలో చేవెళ్లకు అతి సమీపంలో 150 ఎకరాల్లో మైరాన్ హోమ్స్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే సంస్థ 17కి పైగా వెంచర్లను విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. కార్యక్రమంలో సంస్థ సీఎండీ డాక్టర్ ఎం యువరాజు తదితరులు పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఉపకార వేతనాలు

మియాపూర్, ఆగస్టు 18 : కామాక్షి బ్రాహ్మణ సంఘం నిజాంపేట శాఖ ఆధ్వర్యంలో 32 మంది నిరుపేద బ్రాహ్మణ విద్యార్థులకు రూ. 6 లక్షల ఉపకార వేతనాలను ఆదివారం పంపిణీ చేశారు. హైదర్‌నగర్ డివిజన్ నిజాంపేట రోడ్డులోని సంఘం కార్యాలయంలో పలువురు దాతల తోడ్పాటుతో ఉపకార వేతనాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు రాళ్లపల్లి కరుణాకర్, చుండూరు విజయసారథి, సుధాకర్, పారానంది శంకర్, భువనేశ్వరి, రమణి, లక్ష్మీనారాయణ, రాజయ్య, రామారావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు పొందిన బ్రాహ్మణ విద్యార్థులతో దాతలు, నిర్వాహకులు

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శనలు

కొండాపూర్, ఆగస్టు 18 : వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో కళాకారుల నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో ఆర్‌కేఎస్ కళానిలయం నాట్య గురువులు సుందరి రవిచంద్ర శిష్య బృందం ప్రదర్శించిన 'గురు వందన' భరతనాట్య నృత్య ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. కళాకారులు తన్వి, అధ్యశ్రీ, సహస్ర, ప్రవళిక, వరుని, కావ్య, వైష్ణవి, హరిప్రియ, కీర్తి, అనామిక, నిత్య, ఆశ్రిత, కామాక్షి, రియా, క్యాథెరిన్, ఆరాధ్య తదితరులు పుష్పాంజలి, శ్లోకాలు, మల్లరి, నర్తన గణపతిమ్, నారాయణతే, గరుడ గమన, ఇదిగో భద్రాద్రి, ఒకపరి కొకపరి, ఆత్మ రామ, నగుమోము, మాధవ కేశవా, లక్ష్మీ అష్టకం, తక్కువేమి మనకు అంశాలను ప్రదర్శించి అలరించారు.

మహిళా కార్మికులకు న్యాయం చేయడమే లక్ష్యం

బాలానగర్, ఆగస్టు 18 : మహిళా కార్మికులకు న్యాయం చేయడమే తన లక్ష్యమని బీఆర్టీయూ రాష్ట్ర కార్మికనాయకుడు రవిసింగ్ అన్నారు. ఆదివారం గాంధీనగర్‌లోని జీవన్ పాలిమర్స్ పరిశ్రమలో మేనేజ్‌మెంట్ మారిన కారణంగా 24 మంది మహిళా కార్మికులకు జీతాలు ఇవ్వలేదు. దాంతో కార్మికులు బీఆర్టీయూ నాయకుడు రవిసింగ్‌ను కలిసి తమ గోడును తెలియజేశారు. స్పందించిన రవిసింగ్ కంపెనీ కొత్త, పాత మేనేజ్‌మెంట్‌లను కలిశారు. యాజమాన్యం స్పందించి ముందుగా ఒక నెల జీతం ఇచ్చి వారంలో మరో నెల జీతం చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఈ సందర్భంగా రవిసింగ్ మాట్లాడుతూ బీఆర్టీయూ కార్మికుల పక్షాన నిలిచి తగిన న్యాయం చేస్తున్నదన్నారు.

కార్మికులకు వేతనం అందజేస్తున్న బీఆర్టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు రవిసింగ్

యువతి అదృశ్యం

బాలానగర్, ఆగస్టు 18 : బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యమైంది. సీఐ కె. నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సింహద్రి పురం గ్రామానికి చెందిన ఎడ్ల ప్రసాద్‌రావు కుటుంబం బతుకుదెరువు కోసం వచ్చి ఫతేనగర్ డివిజన్ పరిధి గౌతం నగర్‌లో స్థిరపడ్డారు. ప్రసాద్‌రావుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె ఉమామహేశ్వరికి పెండ్లి కాగా చిన్నకుమార్తె అహల్య వీరమణి(18) (సంధ్య) ఓ కంపెనీలో పని చేస్తున్నది. కాగా ఈనెల 15 రాత్రి 9.40 గంటల సమయంలో పెద్ద కుమార్తె ఉమామహేశ్వరి చెల్లి కనిపించడం లేదని తండ్రికి ఫోన్ చేసి చెప్పింది. దాంతో వీరమణి కోసం పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. ఇంట్లో ఒక పుస్తెలతాడు, 20 గ్రాముల బంగారం, 10 తులాల వెండి పట్టీలు, రూ. 15 వేలు తీసుకొని వెళ్లినట్లు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

అహల్య వీరమణి(ఫైల్)

ఆర్‌జీకే మదర్ థెరిస్సా వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

దుండిగల్,ఆగష్టు 18 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, రాజీవ్‌గృహకల్ప సముదాయంలోని మదర్‌థెరిస్సా వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మానేపల్లి నర్సింగరావు నియమితులయ్యారు. సంక్షేమసంఘం చైర్మన్ కొలన్ శ్రీనివాస్‌రెడ్డి(కేఎస్ఆర్) అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మానేపల్లి నర్సింగరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పితాని శ్రీనివాసరావు,ఉపాధ్యక్షుడిగా పోచారం ప్రభాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా ఎర్ర దాలినాయుడు, ట్రెజరర్‌గా ఏ.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏ.నాగభూషణం, తదితరులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం ప్రతినిధులను చైర్మన్ కొలన్ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.

బాచుపల్లి,దుండిగల్‌లో వైభవంగా బోనాలు

- అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసిన ప్రముఖులు

దుండిగల్,ఆగష్టు18 : డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని రాజీవ్ గాంధీనగర్, దుండిగల్ వీలేజ్ హోరెత్తాయి. ఆదివారం శ్రావణమాసం బోనాల పండుగ ఆయా ప్రాంతాల్లో వైభవంగా జరిగింది. దుండిగల్ విలేజ్‌లోని రాజరాజేశ్వరి పోచమ్మ ఆలయం, బాచుపల్లిలోని రాజీవ్‌గాంధీనగర్, ఇంద్రానగర్‌లోని నల్లపోచమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రజలు, ప్రముఖులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు.

సాయంత్రం నిర్వహించిన బోనాలు, తొట్టెల ఊరేగింపు కార్యక్రమాలు వేడుకగా జరిగాయి. నెత్తిన బోనాలతో శివసత్తుల నృత్యాలు, మరో వైపు పోతరాజుల విన్యాసాలు అలరించాయి. మహిళలు పెద్ద ఎత్తున అమ్మవార్లకు బోనాలు, నైవేద్యం సమర్పించారు.

ప్రత్యేక పూజలు చేసిన ప్రముఖులు

ఆయా ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్‌నీలాగోపాల్‌రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌హన్మంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు కావలి గణేశ్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



దుండిగల్ రాజరాజేశ్వరిపోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

రాజరాజేశ్వరిపోచమ్మ ఆలయానికి బోనాలతో వస్తున్న మహిళలు, శివసత్తులు

పూజలు చేస్తున్న కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

చిత్తారమ్మ తల్లికి బోనాలు

బాలానగర్, ఆగస్టు 18 : మూసాపేట చిత్తారమ్మ తల్లి బోనాల పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూసాపేట మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసంలో అమ్మవారి అనుగ్రహం పొందడం ద్వారా సకల శుభాలు కలుగుతాయన్న విశ్వాసంతో అమ్మవారిని భక్తులు దర్శించుకుంటారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పిల్లి శ్రీశైలం యాదవ్, భాస్కర్‌రావు, సుశీల్ కుమార్, మహేశ్‌యాదవ్, షబరీశ్ తదితరతులు పాల్గొన్నారు.

సీపీఐ నిరసన

జగద్గిరిగుట్ట,ఆగస్టు 18 : కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో సీపీఐ నాయకులు ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏసురత్నం, ఉమమహేశ్, హైమావతి, సత్యవతి, ప్రవీణ్, హరనాథ్, యాదగిరి, రాము తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండ.. సీఎం సహాయ నిధి

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, ఆగస్టు 18 : నిరుపేదలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. పేదలకు అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక సాయం అందించి కార్పొరేట్ వైద్యం పొందేలా చేస్తున్నదని పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 20మందికి బాధితులకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ. 8.20 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే గాంధీ ఆదివారం తన నివాసంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యం బారిన పడిన ఎందరో నిరుపేదలు సీఎంఆర్ఎఫ్ సాయంతో అత్యుత్తమ వైద్య సేవలను పొంది ఆరోగ్యంగా జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్ సర్కారు కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎమ్మెల్యే రాఖీ శుభాకాంక్షలు

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి రాఖీ పండుగ ప్రతీక అని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం రాఖీ పండుగను పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా రాఖీ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు.



బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 18 : వర్షాకాలంలో ట్రాఫిక్‌కు, ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు ఆదివారం మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి సారథ్యంలో కొంపల్లి మున్సిపాలిటీ, అల్వాల్, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల ఇంజినీరింగ్ అధికారులతో పలు ప్రాంతాలను పరిశీలించారు. ఎన్‌హెచ్-44 జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నందున వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు, ఇతర అంశాలపై చర్చించారు. పలు ప్రాంతాలను నేరుగా సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అధికారులు, మున్సిపాలిటీ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కొంపల్లిలో సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపాలిటీ, ట్రాఫిక్ అధికారులు

వృద్ధులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి

అల్లాపూర్,ఆగస్టు 18 : వృద్ధులు తరచూ వైద్యులను సంప్రదించి ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించుకోవాలని మోతీనగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. ఆదివారం మోతీనగర్ కమిటీ హాల్‌లో ఎస్‌వీ సాయిప్రసాద్ సేవా ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఎన్.అంజిరెడ్డి, కె.వెంకటేశ్వర్‌రావు, రాజారెడ్డి పాల్గొన్నారు.